# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ అమరావతిలో ప్రాథమిక మౌలిక సదుపాయాల నిర్మాణం గడువులోగా పూర్తవుతుందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.
- ❖ సముద్రంలో చేపల వేటకు వెళ్ళి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు తక్షణ సహాయం కింద 10 లక్షల రూపాయల చెక్కులను మంత్రి కొల్లు రవీంద్ర అందించారు.
- ❖ పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను.. కృష్ణా జలాలతో అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలో నదుల అనుసంధానానికి కృషి చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

==========================

ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులకు చెల్లించే మెస్ ఛార్జీలను 10 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్షేమ శాఖల మంత్రులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుతం ఇస్తున్న మెస్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని నిర్ణయించామన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు మెరుగుపరచాలని ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుందన్నారు. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలన్నారు. మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

==========================

అమరావతిలో ప్రాథమిక మౌలిక సదుపాయాల నిర్మాణం నిర్ణయించిన గడువులోగా పూర్తవుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... మొత్తం 217

చదరపు కిలోమీటర్ల పరిధిలో 4 వేల 026 నిర్మాణాలు, ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఐకానిక్ భవనాలు, హైకోర్టు భవనాల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ఈ నెల 15వ తేదీ నాటికి ఎమ్మెల్యే భవనాలు, 30వ తేదీ నాటికి ఎమ్మెల్సీలు, అధికారుల భవనాలు సిద్ధమవుతాయని మంత్రి వెల్లడించారు. అనంతరం అమరావతి రైతు జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. రాజధాని అమరావతి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

==========================

విశాఖపట్టణం నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్ళి గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించింది. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికీ 10 లక్షల రూపాయల చొప్పున రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెక్కులను ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈరోజు వరకు గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో పరిహారాన్ని అందించామన్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

==========================

దక్షిణ కొరియా బుసాన్‌లో హ్వాసంగ్ గ్రూప్ ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈరోజు సమావేశమయ్యారు. కుప్పంలో 'ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ & మెటీరియల్' తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. విశాఖపట్నంలో డిజైన్, లాజిస్టిక్స్ హబ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే బుసాన్‌లోని షూఆల్స్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ ఫ్యాక్టరీని మంత్రి సందర్శించారు. బూ యంగ్ గ్రూప్ సీఈవో ర్యాన్ కాంగ్, బిజినెస్ స్ట్రాటజీ & ప్లానింగ్ మేనేజర్ మిల్లీ రిచర్డ్‌సన్‌లతో బుసాన్‌లో సమావేశమయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో బూయంగ్ గ్రూప్ పాదరక్షలు, విడిభాగాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ విండో విధానంలో అనుమతులతో పాటు రాష్ట్రంలో ప్రధాన పారిశ్రామిక జోన్లలో కంపెనీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కలిపిస్తామని లోకేశ్ తెలిపారు.

==========================

హింసకు గురైన మహిళలకు సఖి కేంద్రాలు భరోసాగా నిలుస్తున్నాయని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. జాతీయ మహిళా కమిషన్.. రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్తగా నెల్లూరులో ఈరోజు 14 జిల్లాల సఖి వన్ స్టాప్ కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆపదలో ఉన్న మహిళలకు సఖి కేంద్రాలు చివరి ఆశ్రయ కేంద్రాలుగా పని చేస్తున్నాయని తెలిపారు. వైద్య సేవలు, న్యాయ సహాయం, పోలీసు సహకారం, కౌన్సిలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే చోట అందిస్తూ.. బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

విరామం

==========================

పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేసి.. నదుల అనుసంధానానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ఈరోజు పూజలు చేసిన ఆయన మోటార్లను ప్రారంభించి పోలవరం కుడి కాలవలోకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2014-19లో 1,300 కోట్ల రూపాయలతో నిర్మించిన పట్టిసీమ, నేడు 50 వేల కోట్ల రూపాయల ఆదాయం సృష్టించిందన్నారు. ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 442 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడం ద్వారా రాష్ట్ర వ్యవసాయానికి గణనీయమైన ప్రయోజనం చేకూరిందని పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

==========================

పర్వదినాలు, ఉత్సవాలను పురస్కరించుకుని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సెప్టెంబర్ 30వ తేది వరకు బ్రేక్ దర్శనాల రద్దు చేస్తున్నట్లు టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. జులై 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17న ఆణివార ఆస్థానం, ఆగస్టు 22న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 24న పవిత్రాల సమర్పణ, సెప్టెంబర్ 8న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, సెప్టెంబర్ 15 నుండి 23వ తేది వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ సిఫార్సు లేఖలు స్వీకరించమని టిటిడి ఆ ప్రకటనలో పేర్కొంది.

==========================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)కు ఈనెల 14వ తేదీలోగా సమర్పించాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గడువులోగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించిన వారి పేర్లు మాత్రమే జులై 21న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటాయన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె ఈరోజు మాట్లాడుతూ... ఇప్పటివరకు ఫారం అందని వారు లేదా ఫారం నింపడంలో సందేహాలు ఉన్న వారు వెంటనే సంబంధిత BLOలను సంప్రదించాలని సూచించారు.

==========================

రాష్ట్రంలో చర్మకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి  తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర తోలు పరిశ్రమ అభివృద్ధి సంస్థ - లిడ్ క్యాప్ లెదర్ దూకాణాన్ని మంత్రి ఎస్.సవితతో కలసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీబాల వీరాంజనేయ మాట్లాడుతూ... చర్మకారుల ఉపాధి కల్పనకు మార్కాపురం జిల్లా యడవల్లి, కృష్ణా జిల్లా జి.కొండూరులో లెదర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కుల వృత్తిదారులకు ఏడాది పొడుగునా ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

==========================

రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులకు సూచించారు. రాజాం మండలం బొద్దాం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ పోర్టల్‌ను పరిశీలించి రైతులకు ఎరువుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. వారికి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా ఎరువులను పంపిణీ చేయాలని ఆదేశించారు.

==========================

లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ముంబై నుంచి బయలుదేరాల్సిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను రైల్వే అధికారులు మార్చారు. ముంబై (CSMT) నుంచి భువనేశ్వర్ వెళ్లాల్సిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాల్సి ఉంది. అయితే లింక్ రైలు ఆలస్యం కావడంతో.. ఈ రైలును రాత్రి 10 గంటల 15 నిమిషాలకు బయలుదేరనుంది. చెన్నై ఎగ్మూర్ వెళ్లాల్సిన సూపర్‌ఫాస్ట్ రైలు ఇవాళ రాత్రి నిర్ణీత సమయం రాత్రి 10 గంటల 52 నిమిషాలకు బదులుగా.. రాత్రి 11 గంటల 30 నిమిషాలకు ఆలస్యంగా బయలుదేరనుంది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

==========================
==========================